సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం | 31 | జూలై | 2024



ప్రజలను మోసం చేయడంలో నంబర్ 1 చంద్రబాబు

ప్రజలను మోసం చేయడంలో నంబర్ 1గా చంద్రబాబు నిలిచారని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. - 8లో



మృత్యువు కబళించింది

పంక్చరైన ఆటో వద్ద తన ఊరి వారు కనిపించడంతో మాట్లాడేందుకు వెళ్లి ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన శ్రీసత్యసాయి జిల్లా నారేవాండ్లపల్లె వద్ద జరిగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.320	రూ.380
రెండోరకం	రూ.260	రూ.316



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 880 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	445	475
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 394.620 కిలోలు

న్యూస్‌రీల్

హార్సిలీహిల్స్‌పై డీఐజీ విడిది

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై డీఐజీ కోయ ప్రవీణ్ విడిది చేశారు. కర్నూలు నుంచి మదనపల్లె పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం రాత్రి కొండపైకి వచ్చారు. పోలీసు అతిథి గృహంలో విడిది ఏర్పాట్లు చేశారు. మంగళవారం సాయంత్రం డీఐజీ వెనుదిరిగి వెళ్లారు.

ఆగస్టు 1న ఏపీయూడబ్ల్యూజే మహాసభలు

రాయచోటి టౌన్: ఆగస్టు 1వ తేదీన గురువారం రాయచోటిలో ఏపీయూడబ్ల్యూజే మహాసభలు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కన్వీనర్ గానిపల్లె శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్ర రవాణా, క్రీడల, యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పి.రామసుబ్బారెడ్డి, వైఎస్సార్ జిల్లా ప్రధాన కార్యదర్శి బివి నాగిరెడ్డి, విశిష్ట అతిథులుగా అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, హాజరవుతారని తెలిపారు.

వైద్యాధికారులు గ్రామాల్లో పర్యటించాలి

రైల్వేకోడూరు అర్బన్: వైద్యాధికారులందరూ ముందుచూపుతో గ్రామాలలో పర్యటించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. స్థానిక మండల సభా భవనంలో వైద్యాధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు పుట్టిన వెంటనే వారికి వేయాల్సిన టీకాలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రవీంద్రారెడ్డి, రాజశేఖర్, ఆయేషా, సందీప్, సూపర్‌వైజర్ బాలకృష్ణమరాజు పాల్గొన్నారు.

తప్పుల సవరణకు ఆగస్టు 4వరకు గడువు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మున్సిపల్ యాజమాన్యాలలో పని చేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది కేడర్ సంఖ్యను, ఉపాధ్యాయ ప్రొఫైల్ డేటాను www.studentinfo.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేశామని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. ఉపాధ్యాయులు నమోదు చేసిన వివరాలు పరిశీలించి ప్రస్తుత క్యాడర్‌లో చేరిన తేదీ, ప్రస్తుత పాఠశాలలో చేరిన తేదీ, అకడమిక్ అర్హత లేని సబ్జెక్టులు, బీఈడీ మెథడాలజీ సబ్జెక్టులలో తప్పులేమైనా ఉంటే సరిచేసేందుకు ఈ నెల 4వ తేదీలోపు డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేడు పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు



కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 31వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ పరిధిలోని కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన అభ్యర్థులు ఫీజు రియింబర్స్‌మెంట్‌కు అనర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు తమ పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఒరిజినల్ సర్టిఫికెట్, నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు రెండు సెట్లు జిరాక్స్ కాపీలు తమ వెంట తీసుకుని రావాలని సూచించారు.


ఓపెన్ పది, ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



కడప ఎడ్యుకేషన్: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు నోటిఫికేషన్ విడుదలైందని డీఈఓ మర్రెడ్డి అనురాధ, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి తెలిపారు. పదో తరగతిలో చేరేందుకు 14 సంవత్సరాలు నిండిని వారికి, ఇంటర్‌లో చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణులై 15 సంవత్సరాలు నిండిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 27వ తేదీ వరకు గడువు ఉందన్నారు. రూ. 200 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 4వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలోని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీని సంప్రదించాలని సూచించారు.

గూడు కట్టుకున్న వేదన

- కొత్తగా మంజూరయ్యే పీఎంఏవై ఇళ్లకు రూ.4లక్షలు
- పెండింగ్‌లో ఉన్న ఇళ్ల లబ్ధిదారులకు మొండిచేయి
- పాత బిల్లు బకాయిలపై కొరవడిన స్పష్టత
- తమపై కరుణ చూపాలని లబ్ధిదారుల వేడుకోలు





వివిధ దశలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

సాక్షి రాయచోటి: ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో నిర్మించుకుంటున్న కలల గృహంపై కూటమి సర్కార్ కనికరం చూపడం లేదు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అనేకమంది గూడు నిర్మాణానికి ముందుకు వెళితే ప్రస్తుతం కొత్తగా ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షలు అందించాలని నిర్ణయించారు. గతంలో నిర్మించుకుంటున్న వారికి గోడు మాత్రమే మిగిలేటట్టు కనిపిస్తోంది. గతంలో నిర్మాణ వ్యయానికి, ప్రస్తుత ప్రభుత్వం పేర్కొన్న లెక్కకు అంచనా వేస్తే దాదాపు రెట్టింపు సొమ్ము ప్రస్తుతం అందించేందుకు సిద్ధమయ్యారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఇంటి నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా 72,800 పైచిలుకు ఇల్లు నిర్మించాలని భావించి ముందుకు వెళ్లారు.

జిల్లా వ్యాప్తంగా భారీగా ఇళ్ల నిర్మాణం

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. మొత్తం మీద 513 లేఅవుట్లలో జగనన్న ఇళ్ల పనులు లబ్దిదారులు చేసుకుంటున్నారు. అయితే ఇప్పటివరకు 35 వేల వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరికొన్నిచోట్ల నిర్మాణ పనులు అంతంత మాత్రంగా ఉండగా, మరో 32 వేల ఇళ్ల వరకు వివిధ దశల్లో ఉన్నాయి. వీటికి సుమారు రూ. 200–250 కోట్ల వరకు అవసరమవుతుంది. కొత్తగా ఏర్పడిన సర్కార్ నిధులు అందిస్తే పనులు వేగంగా జరిగేందుకు అవకాశం ఉంటుంది. అయితే అధికారులు పేదలకు సంబంధించిన ఇళ్ల విషయంలో వేగంగా చేసుకోవాలని సూచిస్తున్నా బిల్లుల విషయంలో మాత్రం ఆలస్యం కొనసాగుతోంది.

రూ. 4 లక్షలకు అర్హులు కారా?

ప్రస్తుతం కొత్తగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇంటి నిర్మాణాలకు శ్రీకారం చుడితే రూ. 4 లక్షలు అందించాలని కూటమి సర్కార్ నిర్ణయించింది. అందులో కేంద్ర ప్రభుత్వం రూ. 2.50 లక్షలు ఇవ్వనుండగా, రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా రూ. 1.50 లక్షలు అందించాలని మార్గదర్శకాలు జారీ చేశారు. గతంలో వైఎస్సార్ సీపీ హయాంలో రూ. 1.50 లక్షలు ప్రభుత్వం, రూ. 30 వేలు ఉపాధి ద్వారా చేయూత, మరో రూ. 50 వేలు బ్యాంకు రుణం కలుపుకుని రూ. 2.30 లక్షలు అందించేవారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొత్తాన్ని పెంచుతూ లబ్ధిదారులకు చేయూతనివ్వడం మంచిదే. ఈ మొత్తాన్ని గతంలో ఇళ్ల స్థలాలు పొందిన వారికి కూడా వర్తింపజేస్తే ప్రయోజనం అందరికీ చేకూరుతుంది. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టిన అనేక మంది లబ్ధిదారులు నిరాశకు గురవుతున్నారు. ఇంతకుమునుపు ఇల్లు మొదలుపెట్టి ప్రస్తుతం కట్టుకుంటున్న వారికి సంబంధించి కూడా రూ. 4 లక్షలు వర్తింపజేయాలని వారు కోరుతున్నారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే వైఎస్సార్‌సీపీ హయాంలో ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారికి రూ. 4 లక్షలకు పెంచే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికీ, అప్పటికీ నిర్మాణ వ్యయాలు పెరిగిన నేపథ్యంలో లబ్ధిదారులకు అందించే సొమ్ము విషయంలో తేడా ఉండడంతో మేము అర్హులం కాదా? అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన లే అవుట్లు :	513
లే అవుట్లతోపాటు ఇతర ప్రాంతాల్లో ఇళ్ల మంజూరు:	72,821
ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయినవి:	34,000
వివిధ దశల్లో కొనసాగుతున్న ఇళ్లు:	31,092
లబ్ధిదారులకు అందించాల్సిన మొత్తం : రూ.	200-250 కోట్లు

మేము ఎల్లకాలం బాడుగ ఇళ్లల్లోనే ఉండాలా.?



నాపేరు నాగమణెమ్మ. మేము రజకులం. కుల వృత్తిచేసుకొని జీవిస్తున్నాను. జగన్ సీఎంగా ఉన్నప్పుడు సుండువారిపల్లె జగనన్న కాలనీలో నాకు ఇంటిస్థలం ఇచ్చి ఇల్లు కూడా మంజూరు చేశాడు. నా కష్టార్జితంలో కొంత మిగలపెట్టుకొని, కొంచెం అప్పు చేసుకొని బేస్‌మట్టం వేసుకున్నాను. బేస్‌మట్టంకు వచ్చిన డబ్బు అప్పు తీర్చుకున్నా. మళ్లీ కూడపెట్టుకొని గోడలు కట్టుకుందామనుకుంటున్నా. అయితే చంద్రబాబునాయుడు జగనన్న ఇళ్లకు డబ్బులు ఈయను అని సెబుతున్నాడు. మాబోటి పేదోళ్లకు సాయం చేయకుంటే మేము ఎట్టా ఇల్లు కట్టుకోవాలి. మేము ఎల్లకాలం బాడుగ ఇళ్లల్లోనే ఉండాలనా. జగనన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకునే వాళ్లకు కూడా ప్రభుత్వం డబ్బులు ఇవ్వాలి. లేకుంటే చాలా మంది పేదోళ్లకు సొంత ఇల్లు అనే మాట ఉండదు.

ప్రభుత్వ భూములకు భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి

సుండుపల్లి: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన అవసరం ఉందని రాజంపేట డివిజన్ సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి సూచించారు. మంగళవారం సుండుపల్లె తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డుల గదిని పరిశీలించారు. కార్యాలయ ఉద్యోగుల సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో ఎక్కడా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా భద్రత కల్పించాలని సూచించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసులు, సిబ్బంది స్వాగతం పలికారు.

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

వీరబల్లి: మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయాన్ని మంగళవారం అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివ ప్రకాష్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్‌ఓ ప్లాంటును వాడుకలోకి తేవాలని, పిల్లలకు శుద్ధ నీటిని అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో భావితరాలకు ఆదర్శం కావాలి

సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్రచౌధురి



కడప కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న రాజేంద్ర చౌధురి

వైవీయూ: చెట్ల పెంపకమే భవిష్యత్ తరాలకు అందించే గొప్ప బహుమతి అని, పర్యావరణాన్ని కాపాడుకుని భావితరాలకు మేలు చేయటమే గాక వారికి ఆదర్శంగా నిలవాలని భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌధురి పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'అమ్మ పేరిట ఒక మొక్క' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్ర చౌధురి, కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినుల చేత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాషా మాట్లాడుతూ పర్యావరణం – ప్రగతిని సమన్వయం చేసుకుని ముందుకు సాగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ ప్రజంటేషన్‌పై పోటీలు నిర్వహించి విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కడప క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కార్యాలయ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ శచీదేవి, నాగరత్నమ్మ, అనూరాధ, వాహిదా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దనే పెన్షన్ అందిస్తాం

జిల్లా కలెక్టర్ శ్రీధర్



అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద అందజేసే పెన్షన్ డబ్బులు లబ్దిదారులకు ఇంటివద్దనే ఆగస్టు 1వ తేదీన వందశాతం పంపిణీ చేస్తామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. ఒకటో తేదీన లబ్ధిదారులందరూ వారి ఇళ్ల వద్దనే అందుబాటులో ఉండాలని సూచించారు. మంగళవారం విజయవాడ సీఎస్ క్యాంప్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆగస్టు ఒకటో తేదిన పూర్తి చేయాలని ఆదేశించిందని కలెక్టర్ చెప్పారు. అన్నమయ్య జిల్లాలో 2,22,313 మంది పింఛన్‌దారులకు రూ. 94 కోట్ల, 34 లక్షలు నగదును పంపిణీ చేస్తామన్నారు. పింఛన్ల పంపిణీపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన చెప్పారు.

సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి



గర్నిమిట్ట పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

కేవీపల్లె: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. మంగళవారం మండలంలోని గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, ఏ సమయానికి పెడుతున్నారని ప్రశ్నించారు. మూడు రోజులుగా పిల్లలకు గుడ్లు అందుబాటులో లేవని అంగన్‌వాడీ కార్యకర్త తెలపడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఆదేశించారు. అనంతరం గర్నిమిట్ట పశువైద్యశాలను, వగళ్ల కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు.

రైలు బండి.. ప్రయాణం కష్టమండి!



రాజంపేట ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి పూరి ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో ప్రయాణం చేశారు. అప్పటికే జనంతో కిక్కిరిసిన పరిస్థితులు కాలుతీసి అడుగు వేయలేని స్థితి ఆయనను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. మూత్రవిసర్జన సమస్య తీవ్రం కావడంతో టాయిలెట్స్ రూం వద్దకు వెళ్లలేక, అప్పటికే లెట్రిన్‌లో కూడా నలుగురు ఉండటం, డోర్ వద్ద ఉండటంతో ఇక మూత్రం ఆపుకోలేని స్థితిలో తన వద్ద ఖాళీ వాటర్ బాటిల్‌ను పై వరకు కట్‌చేసి అందులో మూత్రం పోసి బయటపారేసిన యథార్థ సంఘటన ఇది. జనరల్ బోగీలో ప్రయాణికుల ఇక్కట్లు..ఇబ్బందులకు సజీవ సాక్ష్యమిది.

- భారంగా మారుతున్న రైలు ప్రయాణం
- స్లీపర్ కోచ్‌ల తగ్గింపు
- ఏసీ కోచ్‌ల పెంపు
- జనరల్ బోగీలపై చిన్నచూపు
- కాలు మోపేందుకు వీలులేని పరిస్థితి
- రైల్వేశాఖ తీరుతో సామాన్యులకు తప్పని ఇక్కట్లు



జనరల్ బోగీలో కాలుమోపలేని స్థితిలో కిక్కిరిసిన ప్రయాణికులు



జనరల్ బోగీలో తప్పని ఫుట్‌బోర్డు ప్రయాణం

రాజంపేట: చెన్నై–ముంబయి మధ్య 22157/22158 , 22159/22160, 12163/12164 నంబర్లతో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సింగిల్ జనరల్ బోగీనే అందుబాటులో ఉంచడం కనిపిస్తోంది. ఈ విధమైన పరిస్థితి అనేక రైళ్లలో కొనసాగుతోంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా మీదుగా ఈ మార్గంలో 25 స్టేషన్లు ఉండగా, డైలీ 30 (అప్ అండ్ డౌన్) రైళ్లు నడుస్తున్నాయి.

మోదీ సర్కారులో జనరల్ ప్రయాణం నరకం

ఎన్‌డీఏ పాలనలో దేశ వ్యాప్తంగా అన్ని రైళ్లలో జనరల్ కోచ్‌లు తగ్గించి వేశారనే విమర్శలు పేదవర్గాల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పుడు వాటి జాడ కనుక్కొనేందుకు పేద ప్రయాణికులు ప్లాట్‌ఫాంపై ఉరుకులు, పరుగులు తీయాల్సి వస్తోంది. ప్రయాణంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఒక్కోసారి ప్రయాణికులు జనరల్ బోగీలోకి ఎక్కలేక స్లీపర్‌కోచ్‌లో ఎక్కి కొంతమంది టీసీల దురుసుతనంతో నెట్టివేయబడిన సంఘటనలు కోకొల్లలు.

వందేభారత్‌లతో..

రైల్వేశాఖ పేదలకు అనుకూలమైన రైళ్లు తీసుకురావడం కన్నా వందేభారత్ లాంటి ఖరీదైన రైళ్లను తీసుకు రావడంతో పేదలకు రానురాను రైళ్లు దూరమవుతున్నాయనే వాదన మేధావి వర్గాల నుంచి వినిపిస్తోంది. పేదవర్గాలు ప్రయాణించే ప్యాసింజర్లను ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్చివేసి, పట్టాలెక్కిస్తున్నారు. వందేభారత్ వల్ల దూరప్రాంత ప్రయాణికులకు మేలు జరిగినా, అందులో ధరలు చూస్తే పేద, మధ్యతరగతి వాసులు ఆ బండి వైపు కన్నెత్తి చూడరనేది సుస్పష్టం.

మార్గం:	ముంబయి-చెన్నై
రైళ్లు:	30 (అప్‌అండ్ డౌన్)
జనరల్‌బోగీ:	ఒకటి లేదా రెండు

జనరల్ బోగీలు కిటకిట

సాధారణంగా రైళ్లలో జనరల్ బోగీలు ఐసీఎఫ్ కోచ్ (ఇంటిగ్రిల్ కోచ్ ఫ్యాక్టరీ)లో 90 మంది, ఎల్‌హెచ్‌బీ కోచ్‌లో 110 మంది వరకు కూర్చొని ప్రయాణించవచ్చు. అయితే ప్రస్తుతం 200–250, 300 మంది వరకు జనరల్ బోగీల్లో ప్రయాణిస్తున్నారు. నిత్యం కిటకిటలాడే జనరల్ బోగీల్లో కనీసం ఎక్కడానికి కూడా వీలు కాని పరిస్థితి నెలకొంది. దీంతో చాలామంది స్లీపర్ కోచ్‌లలో ప్రయాణిస్తున్నారు. మరోవైపు స్లీపర్ టిక్కెట్ల కోసం చూస్తే రిజర్వేషన్ దొరకడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు త్రీ టైర్‌లో ఏసీ టిక్కెట్లు తీసుకుని ప్రయాణిస్తున్నారు. ఒకవైపు ఏసీ టిక్కెట్లు భారమైనా ప్రయాణించక తప్పడం లేదు.


ప్రయాణం నరకప్రాయం



జనరల్ బోగీలలో ప్రయాణం నరకంగా ఉంది. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు అధికంగా ఉండేలా చూడాలి. మోదీ సర్కారులో పేద, మధ్యతరగతి ప్రయాణికులకు జనరల్ బోగీలు ఉన్నాయా అనే అనుమానం కలుగుతోంది. రైలు ప్రారంభం నుంచే జనరల్‌బోగీ కిక్కిరిసిపోతోంది. మార్గమధ్యంలో ఎక్కేవారు అధికమవుతున్నారు. ఫలితంగా జిల్లా పరిధిలోకి రైలు వచ్చేసరికి ఉన్న బోగీలో కాలుపెట్టేందుకు వీలు లేని దుస్థితిలో ఉంటున్నాయి.

–సయ్యద్ ఖాజామొహిద్దీన్, రాజంపేట

పేదలకు రైలు ప్రయాణం దూరం



జిల్లా మీదుగా చెన్నైకు నడిచే పలు రైళ్లలో పేదోడికి సరిపడా జనరల్ బోగీలు కనిపించడంలేదు. రాను రాను పేదవాళ్లకు రైలుప్రయాణం దూరమవుతోంది. ఫార్మసిస్‌లో చాలీచాలని బోగీలు కిక్కిరిసిపోతున్నాయి. జనరల్‌బోగీలు పెంచడం కంటే ఖరీదైన ప్రయాణాలపై రైల్వేమంత్రిత్వశాఖ దృష్టి సారిస్తోంది. పేద, మధ్యతరగతి ప్రయాణికులకు జనరల్ బోగీలో కష్టాలు దారుణంగా ఉన్నాయి. విధిలేని పరిస్థితిలో ఫుట్‌బోర్డు ప్రయాణంతో పలువురు మృత్యువాత పడుతున్నారు.

–తల్లెం భరత్‌రెడ్డి, మాజీ మెంబర్, డీఆర్‌యూసీసీ

విద్యుత్ షాక్‌తో తాపీ మేస్త్రీ మృతి

పీలేరు రూరల్ : విద్యుత్ షాక్‌తో మేస్త్రీ మృతి చెందిన సంఘటన స్థానిక మదనపల్లె రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. మండలంలోని కంచెంవారిపల్లెకు చెందిన సుధాకర (54) తాపీ మేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగించేవాడు. మంగళవారం ఇందిరమ్మ కాలనీలో తన సొంతింటి పని చేస్తూ ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లు తాకి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పీలేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

పెద్దమండ్యం : ఇంటి నుంచి ఓ విద్యార్థిని అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ ప్రకాష్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దమండ్యం పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన రామాంజులమ్మ, శ్రీనివాసులు పానీపూరి బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. మొదటి కుమార్తె ఉదయశ్రీ (15) స్థానిక ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. 26న రాత్రి ఇంటిలో ఉన్న విద్యార్థిని బాత్రూంకు వెళ్తున్నట్లు చెప్పి అదృశ్యమైనట్లు వారు చెప్పారు. విద్యార్థిని ఆచూకీ కోసం విచారణ చేయగా గాలివీడులో కటింగ్ షాపు నడుపుతున్న శ్రీనాథ్ అనే యువకుడు తన ద్విచక్ర వాహనంలో తీసుకెళ్లినట్లు తెలిసిందని ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో గాలివీడుకు వెళ్లి చూడగా అతను నడుపుతున్న కటింగ్ షాపు మూతవేసి ఉన్నట్లు ఫిర్యాదులో తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బ్యాంకును మోసగించిన కేసులో కాంగ్రెస్ నేత అరెస్ట్

- శంషాబాద్‌లోని ఇద్దరు ఇండస్‌ఇండ్ బ్యాంక్ మేనేజర్లు కూడా..
- ఆదిత్యా బిర్లా హౌసింగ్ ఖాతా నుంచి రూ.40 కోట్లు బదిలీ
- ఖాతాదారునికి తెలియకుండా అనధికారికంగా లావాదేవీలు
- వెంటనే 20కి పైగా వేర్వేరు ఖాతాలకు సొమ్ము బదిలీ


బషీద్

సాక్షి, సిటీబ్యూరో: బ్యాంక్ ఖాతాదారునికి తెలియకుండా రూ.40 కోట్లు కాజేసిన కేసులో ఇద్దరు బ్యాంక్ మేనేజర్లతో సహా కాంగ్రెస్ నాయకుడు షేక్ బషీద్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. బషీద్ ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ తరఫున రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశాడని సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) డీసీపీ కె.ప్రసాద్ తెలిపారు. కేసు పూర్తి వివరాలివీ.. ముంబైలోని నారిమన్ పాయింట్‌లోని ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఖాతా ఉంది. బ్యాంక్ అంతర్గత ఆడిట్‌లో భాగంగా జూలై 12న ఈ ఖాతా నుంచి శంషాబాద్‌లోని ఇండస్‌ఇండ్ బ్యాంచ్‌కు రూ.15 కోట్లు, రూ.25 కోట్లుగా రెండు విడతల్లో రూ.40 కోట్ల నగదు బదిలీ అయినట్లు బ్యాంక్ అధికారులు గుర్తించారు. ముంబైలోని ప్రధాన కార్యాలయం అనుమతి లేకుండా అనధికారికంగా ఈ నగదు బదిలీ జరిగినట్లు తేలడంతో జోనల్ హెడ్‌ను అప్రమత్తం చేశారు. దీంతో ఇండస్‌ఇండ్ బ్యాంక్ జోనల్ హెడ్ (ఆపరేషన్స్) మణికందన్ రామనాథన్ జూలై 19న సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బ్యాంక్ మేనేజర్ల పనే..

శంషాబాద్‌లోని ఇండస్ ఇండ్ బ్యాంక్ మేనేజర్ కనుగుల రామస్వామి, సర్వీస్ డెలివరీ మేనేజర్ సపాయి రాజేశ్ ఈ వ్యవహారంలో కీలక సూత్రధారులు. ఆదిత్యా బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ ఖాతాలో కోట్లలో జరుగుతున్న లావాదేవీలను గుర్తించిన ఇరువురు నిందితులు పక్కా పథకం వేశారు. జూలై నెలలో జూబ్లీహిల్స్‌కు చెందిన వ్యాపారి షేక్ బషీద్ పేరుతో బ్యాంక్ అకౌంట్‌ను తెరిచారు. ఈ ఖాతాకు ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ చెక్, ఆర్టీజీఎస్ లేకుండా అనధికారికంగా రూ.40 కోట్ల నగదును బదిలీ చేశారు. క్షణాల్లోనే ఈ అకౌంట్ నుంచి జాతీయ, ప్రైవేట్ బ్యాంక్‌ల్లోని 20 వేర్వేరు ఖాతాలకు బదిలీ చేశారు. ఈ సొమ్ములో కొంత మొత్తాన్ని వేర్వేరు ఏటీఎంల నుంచి విత్ డ్రా చేశారు.

బహుమతిగా ఫార్చ్యునర్ కార్లు

కొట్టేసిన సొమ్ముతో బషీద్ రెండు టయోటా ఫార్చ్యునర్ కార్లను కొనుగోలు చేశాడు. వీటిలో ఒకటి బ్యాంక్ మేనేజర్ రామస్వామికి బహుమతిగా అందించాడు. ఆ తర్వాత మిగిలిన సొమ్ముతో బషీద్ ఢిల్లీకి పరారయ్యాడు. సాంకేతిక ఆధారాలను సేకరించిన పోలీసులు నిందితులు రామస్వామి, రాజేష్‌లను హైదరాబాద్‌లో, బషీద్‌ను ఢిల్లీలో అరెస్టు చేశారు. వీరిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో అరెస్టయిన ఏ-3 బషీద్ పెద్ద దేశముదురే. ఇతనిపై గతంలో హైదరాబాద్ కమిషనరేట్‌లోని సీసీఎస్‌లో, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజగుట్ట, బోయిన్‌పల్లి పీఎస్‌లతోపాటు సైబరాబాద్‌లోని నార్సింగి, వికారాబాద్ జిల్లాలోని మోమిన్‌పేట్ ఠాణాలలో పదికి పైగా చీటింగ్ కేసులున్నాయి. బషీద్ పలు సినిమాలను నిర్మించడంతోపాటు నటించాడు కూడా.

రైతాంగ సమస్యలపై పోరాటం

- సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ


ఏపీ రైతుసంఘం సమ్మేళనంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

మదనపల్లె : రైతాంగ సమస్యల పరిష్కారానికి గ్రామీణ ప్రాంతాల నుంచి రైతాంగాన్ని సమీకరణ చేసి పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్వీఆర్ కల్యాణ మండపంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న రైతు సమ్మేళనంలో రెండో రోజు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో దేశంలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పోరాటం ఢిల్లీలో రైతులు చేశారన్నారు. ప్రధాని మోదీకి ఎలాంటి విజన్ లేదని, దేశసంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు పరిపాలన చేస్తున్నారని ఆరోపించారు. దేశ రాజకీయాలను కార్పొరేట్లు శాసిస్తున్నారని, వారి ప్రయోజనాల కోసమే బీజేపీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతిపక్షపార్టీల నేతలను, వామపక్షాల మేధావులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతూ, నరేంద్రమోదీ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు పూర్తిగా న్యాయం జరగాలంటే... కేంద్ర బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు అప్పుగా కాకుండా గ్రాంటుగా ఇవ్వాలన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో అధికారం కోసం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత కిసాన్‌సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరయ్య, కె.వి.వి.ప్రసాద్, నాయకులు కాటమయ్య, జమలయ్య, జగన్నాథం, రామానాయుడు, అప్పలనాయుడు, డేగా ప్రభాకర్, ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పెంచలయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, మహేష్, తోపుకృష్ణప్ప, సాంబశివ, వంగిమళ్లరంగారెడ్డి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడేందుకు ఆగితే మృత్యువు కబళించింది

- మరో ఇద్దరికి గాయాలు
- బి.కొత్తకోట వాసులకు శ్రీ సత్యసాయి జిల్లాలో ప్రమాదం


రామకృష్ణ (ఫైల్)


ఘటనా స్థలంలో మృతి చెందిన రామకృష్ణ

బి.కొత్తకోట : పంక్చరైన ఆటో వద్ద తన ఊరి వారు కనిపించడంతో మాట్లాడేందుకు వెళ్లి దుర్మరణం చెందాడు. ఇదే సంఘటనలో ఆటో వద్ద ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం రాత్రి శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం నారేవాండ్లపల్లె వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బి.కొత్తకోటకు చెందిన మహమ్మద్‌అలీ, ఆరీఫ్‌లు ఆటోలో తనకల్లు మండలం వెళ్లారు. అక్కడ పుస్తకాలు, గుజిరి వస్తువులతో బి.కొత్తకోటకు వస్తున్నారు. మార్గంమధ్యలో నారేవాండ్లపల్లె వద్ద ఆటో పంక్చర్ కావడంతో రోడ్డు పక్కన నిలిపేశారు. ఇదే సమయంలో బి.కొత్తకోట బీసీ కాలనీకి చెందిన జి.రామకృష్ణ (36) టాటా ఏస్ వాహనంతో రాత్రి ఏడు గంటల తర్వాత కదిరికి బయలుదేరాడు. నారేవాండ్లపల్లె వద్ద ఆగివున్న ఆటో వద్ద బి.కొత్తకోటకు చెందిన వారు కనిపించడంతో మనఊరి వాళ్లు ఇక్కడున్నారు, ఏమైందో మాట్లాడుదామని తన వాహనాన్ని పక్కన నిలిపి వారి వద్దకు వెళ్లాడు. ఆరీఫ్, మహమ్మద్‌అలీతో మాట్లాడుతుండగా కదిరి నుంచి మదనపల్లె వైపునకు వెళ్తున్న కంటైనర్ లారీ వీరిని ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రామకృష్ణ ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందగా, గాయపడిన మహమ్మద్ అలీ, ఆరీఫ్‌లను చికిత్స నిమిత్తం స్థానికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన రామకృష్ణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మృతితో బంధువులు, కుటుంబీకులు బోరున విలపించారు. రామకృష్ణ మృతదేహానికి మంగళవారం సాయంత్రం బి.కొత్తకోటలో అంత్యక్రియలు జరిగాయి.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ


విచారణ చేస్తున్న తాలూకా పోలీసులు


బీరువాలోని వస్తువులు చిందరవందరగా వేసిన దృశ్యం

- రూ. 20 లక్షలకు పైగా నగలు, నగదు అపహరణ
- క్లూస్ టీంతో తనిఖీలు

మదనపల్లె : కుటుంబ సభ్యులతో కలిసి జాతరకు వెళ్లిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో రూ.20 లక్షలకు పైగా విలువచేసే బంగారు నగలు, వెండి ఆభరణాలు, నగదు దోచుకుని వెళ్లారు. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకోవడంతో చోరీ వెలుగు చూసింది. మదనపల్లె మండలం తట్టివారిపల్లి పంచాయతీ శ్రీనగర్ కాలనీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు గురుమూర్తి... తన భార్య శారద, కుమారుడితో కలిసి ఉంటున్నారు. ఆయన నిమ్మనపల్లి మండలం బండ్లపై ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి, కలికిరిలో జరుగుతున్న ఎల్లమ్మ జాతరకు బంధువుల ఇంటికి వెళ్లారు. జాతర ముగించుకొని మంగళవారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడం, బీరువా తెరచి వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. అపహరణకు గురైన వస్తువుల వివరాలతో మదనపల్లె తాలూకా పోలీసులకు బాధితుడు గురుమూర్తి ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే తాలూకా సీఐ ఎస్.శేఖర్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. పెద్దమొత్తంలో నగదు, నగలు అపహరణకు గురయ్యాయని బాధితులు వాపోయారు. ఇంటిలో దాచుకున్న 300 గ్రాముల(రూ.15 లక్షలకు పైగా విలువ చేసే)బంగారు నగలు, 1.5 కిలోల (రూ.1.2 లక్షల విలువైన)వెండి ఆభరణాలతో పాటు, రూ.4.6 లక్షల నగదు అపహరణకు గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. జాతరకు వెళ్లి వచ్చేలోగా తాము కష్టపడి సంపాదించి దాచుకున్న సొమ్మును కాజేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

బోడుమల్లుదిన్నెలో మరో చోరీ

మండలంలోని కొండామర్రిపల్లె పంచాయతీ బోడుమల్లుదిన్నె గ్రామంలో చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికంగా నివాసం ఉన్న రైతు పాల రెడ్డప్ప కుటుంబ సభ్యులతో కలసి, ఇంటికి తాళాలు వేసి సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. పొలం నుంచి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఆత్రంగా ఇంట్లోకి వెళ్లి చూడగా.. వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండటం, బీరువా తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. పగలు ఇంటి వద్ద ఎవరు లేకపోవడాన్ని గమనించిన దుండగులు గుట్టుచప్పుడు కాకుండా చోరీకి పాల్పడ్డారు. దీంతో బాధితుడు రెడ్డప్ప సోమవారం రాత్రి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటన స్థలాన్ని మదనపల్లె తాలూకా పోలీసులు పరిశీలించారు. కాగా చోరీ ఘటనలో 60 గ్రాముల (దాదాపు రూ.3 లక్షలకు పైగా విలువైన)బంగారు ఆభరణాలు, ఇంటిలో ఉంచిన రూ.లక్ష రూపాయల నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్.శేఖర్ తెలిపారు.

మామిడి చెట్ల నరికివేత


మామిడి చెట్లను నరికివేసిన దృశ్యం

గాలివీడు : మండల పరిధి అరవీడు గ్రామంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన షేక్ షబ్బీర్‌అహమ్మద్‌కు చెందిన 14 మామిడి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. షబ్బీర్‌అహమ్మద్ జీవనోపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. తన భార్య, బిడ్డల కుటుంబ పోషణ కోసం తన పొలంలో 140 మామిడిచెట్లను పెంచుకుంటున్నారు. అయితే సోమవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు అందులో 14 చెట్లను నరికివేసినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు ఏళ్ల వయసు కలిగి దాదాపు రూ.2 లక్షల విలువజేసే 14 మామిడి చెట్లను నరికి వేసినట్లు వారు పేర్కొన్నారు. ఇప్పుడిప్పుడే చేతికందాయనుకున్న తరుణంలో ఇలా జరగడంతో తీవ్రంగా నష్టపోయామని వారు వాపోయారు. వెంటనే సంబంధిత అధికారులు విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

తేలు కుట్టి వ్యక్తి మృతి


పిచ్చయ్య (ఫైల్)

సిద్దవటం : మండల పరిధి శాఖరాజుపల్లె గ్రామ పంచాయతీలోని బాపనపల్లె గ్రామానికి చెందిన ఏటూరి పిచ్చయ్య(57) అనే కౌలు రైతు తేలు కుట్టి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆయన భార్య లక్ష్మీదేవి, కుమారుడు హరి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బాపనపల్లె గ్రామానికి చెందిన ఏటూరి పిచ్చయ్య రజక వృత్తిని చేసుకుంటూ 70 సెంట్ల భూమిని కౌలుకు తీసుకొని అరటి పంట సాగు చేశాడు. ఆయన ఈ నెల 22వ తేదీన అరటి పంటలో కలుపు తీసేందుకు పొలంలోకి వెళ్లగా విషపురుగు కాటేసింది. బాధితుడిని కుటుంబ సభ్యులు హుటాహుటిన కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు తేలు కుట్టినట్లు నిర్ధారించారు. అతను అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు హరి రిమ్స్ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహానికి శవపరీక్ష నిర్వహించారు. తాము పూరిగుడిసెలో నివసిస్తూ జీవిస్తున్నామని, కుటుంబ పెద్దను కోల్పోయామని, తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

వాల్మీకిపురం : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమైన సంఘటన మండలంలోని చింతపర్తి పంచాయతీ తాళ్లపల్లిలో మంగళవారం చోటు చేసుకొంది. బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాళ్లపల్లి దళితవాడకు చెందిన చంద్ర కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ పూరి గుడిసెలో నివాసం ఉంటున్నాడు. ఆయన మంగళవారం కూలీ పనులకు వెళ్లిన సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి, గుడిసె కాలిపోయింది. గమనించిన సమీప వాసులు మంటలు ఆర్పినా.. అప్పటికే నష్టం జరిపోయింది. ఇంట్లో ఉన్న బట్టలు, బియ్యం, టీవీ తదితర సామగ్రి కాలి బూడిదయ్యాయి. రూ.70 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. చంద్రకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరాడు.

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

నందలూరు : నందలూరు రైల్వే కేంద్రంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కన్సల్టేటివ్ కమిటీ మెంబర్స్ కోరారు. మంగళవారం రైల్వేస్టేషన్‌లో రైల్వేస్టేషన్ మేనేజర్ కమలాకర్, రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అమర్నాథ్‌ల ఆధ్వర్యంలో స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో నందలూరు రైల్వేకు సంబంధించిన సమస్యలు, కల్పించాల్సిన సదుపాయాలు గురించి చర్చ జరిగింది. ముఖ్యంగా నందలూరులో రైళ్ల నిలుపుదల, రైళ్లకు నీరు నింపడం, రైల్వే ఫంక్షన్ హాల్‌లో సదుపాయాల ఆధునికీకరణ నిర్మాణంలో ఉన్న రైల్వే అండర్ పాస్‌ను త్వరితగతిన పూర్తి చేయడం, ప్రయాణికులకు వెయిటింగ్ హాల్ లాంటివి తప్పనిసరిగా కావాలని కమిటీ మెంబర్స్ డిమాండ్ చేశారు. రైల్వే ప్రయాణ ప్రాముఖ్యతను స్థానిక ప్రజలలో అవగాహన కల్పించి తద్వారా ప్రయాణికుల సంఖ్యను పెంపొందిస్తామని మెంబర్స్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కమిటీ మెంబర్స్ డాక్టర్ అరిగె సాంప్రసాద్, సమ్మెట శివప్రసాద్, ముంగి సుబ్బరాయుడు, మురళీ, రైల్వే పీఆర్ఎఫ్ ఏఎస్ఐ రవిబాబు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్

ఎన్పీకుంట(శ్రీ సత్యసాయి జిల్లా) : ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లే అంతర్ రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని ఎన్పీకుంటలో మండెంవారిపల్లి క్రాస్ వద్ద మంగళవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో.. అదే గ్రామం నుంచి స్కార్పియో వాహనం, 4 ద్విచక్ర వాహనాల్లో వస్తున్న కొందరు పోలీసులను చూసి, వాహనాలను వదిలి పారిపోయారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే వారిని వెంటాడి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం ఎగువమూలపల్లికి చెందిన యోగీశ్వరనాయుడు, కర్ణాటకలోని హనకల్ తాలూకా సర్జాపురా నివాసి వి.సునీల్‌కుమార్, ఉస్కర్ గ్రామానికి చెందిన ఎం.చిన్నరాజ్, బెంగుళూరులోని బొమ్మనహళ్లికి చెందిన ఆల్బర్ట్, చిత్తూరు జిల్లా నివాసి హేమచంద్ర ఓ ముఠాగా ఏర్పడి ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లి, తక్కువ ధరతో విక్రయించి సొమ్ము చేసుకునే వారు. ఈ ముఠాకు నాయకుడిగా యోగీశ్వర నాయుడు వ్యవహరించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 29న తెల్లవారుజామున 3 గంటల సమయంలో ముఠా సభ్యులను తన స్కార్పియో వాహనంలో యోగీశ్వరరెడ్డి పిలుచుకెళుతూ.. ఎన్పీ కుంట మండలం కొట్టంవారిపల్లిలో రోడ్డు పక్కన ఇంటి ఎదుట ఆపిన ద్విచక్ర వాహనాన్ని అపహరించుకెళ్లే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో ఇంట్లో వారు బయటకు రావడంతో ఇనుప రాడ్లు చూపి చంపుతామని బెదిరించారు. దీంతో కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో వారు అక్కడి నుంచి పరారవుతూ మండెంవారిపల్లి క్రాస్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల్లో ఇద్దరు పరారయ్యారు. కొట్టంవారిపల్లిలో చోరీ చేసిన ద్విచక్రవాహనానికి సంబంధించి బాధితుడి నుంచి పోలీసులు ఫిర్యాదు స్వీకరించి, వాహనాన్ని అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు


గాయపడిన మధుసూదన్‌రెడ్డి

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడిన సంఘటన మంగళవారం కురబలకోట మండలంలో జరిగింది. పెద్దమండ్యం మండలం వెలిగల్లు పంచాయతీ కుడుములవారిపల్లెకు చెందిన మధుసూదన్‌రెడ్డి (48) తన భార్య జానకి(40)తో కలసి సొంత పనులపై ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు బయలుదేరారు. మదనపల్లె- అంగళ్లు మార్గంమధ్యలోని కల్యాణమండపం మలుపు వద్ద ఎదురుగా వచ్చిన కారు.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మధుసూదన్‌రెడ్డి తీవ్రంగా, జానకి స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి..

సంబేపల్లె : చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మధు అనే వ్యక్తికి గాయాలైన సంఘటన చోటు చేసుకొంది. మండల పరిధిలోని గిగువరాజుగారిపల్లె దళితవాడకు చెందిన మధు ద్విచక్రవాహనంలో రాయచోటికి వెళుతుండగా సంబేపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోకి రాగానే అదుపు తప్పి బోల్తా పడ్డాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డ అతన్ని 108 వాహనం ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజలను మోసం చేయడంలో నంబర్ 1 చంద్రబాబు

- రాష్ట్రంలో ఆటవిక, అరాచక పాలన
- ప్రజల వెంట ఉండి పోరాటం
- మాజీ ఎమ్మెల్యే కొరముట్ల



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : ప్రజలను మోసం చేయడంలో నంబర్ 1గా చంద్రబాబు నిలిచారని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రచారాలు చేసి తీరా గెలిచాక.. ప్రజలకు అప్పుల పేరు చెబుతూ తేనె పూసిన కత్తిలా తయారయ్యాడని విమర్శించారు. గడిచిన 50 రోజులలో రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు చూస్తే ఆటవిక, అరాచక పాలన నడిచినట్లు ఉందన్నారు. కొత్త పథకాలు ఇవ్వకపోగా వస్తూ వున్న పథకాలు ఆపేసి దోపిడీలు, దౌర్జన్యాలకు తెరలేపారని పేర్కొన్నారు. అప్పుల పేరుతో చంద్రబాబు అసెంబ్లీలో డ్రామాలు చేయడం కేవలం పథకాలు ఇవ్వడం ఇష్టం లేకనే అని తెలిపారు. ఆఖరికి ఇసుక ఫ్రీ అని షరతులతో పేదల నడ్డి విరుస్తున్నాడని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా నాలుగేళ్లు రూ.2 లక్షల కోట్లు అప్పు చేసి అన్ని పథకాలు ప్రజలకు అందించారని గుర్తు చేశారు. 14, 19 ఏళ్ల మధ్య చంద్రబాబు రూ.5 లక్షల కోట్లు అప్పు చేశాడని, అయినా ఒక్కపథకం కూడా సక్రమంగా అమలు చేయలేదని తెలిపారు. ప్రజలు ఇప్పుడిప్పుడే కళ్లు తెరుస్తున్నారని తెలిపారు. ఇప్పటికే అమ్మకు వందనం, రైతుభరోసా వంటి పథకాలు అందించకుండా ఆపారని తెలిపారు. ఇచ్చిన హామీలు, సూపర్‌సిక్స్ పథకాలకు పంగనామాలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీలో గవర్నర్‌తో కూడా అబద్ధం చెప్పించారని తెలిపారు. బడ్జెట్ ప్రవేశ పెడితే పథకాలకు నిధులు కేటాయించాల్సి వస్తుందని ఓటాన్ అకౌంటుకు వెళ్లారని విమర్శించారు. చంద్రబాబు దిగేటప్పుడు 100 కోట్లు కూడా లేవని, అయినా ఆనాడు జగన్‌మోహన్‌రెడ్డి బడ్జెట్ కేటాయించి అమలు చేసారని గుర్తు చేశారు. కానీ తమ ప్రభుత్వం 8 వేల కోట్లు మిగలబెట్టి ఇస్తే అప్పులు చేశారని తన మీడియాతో ప్రచారం చేయించి, తరువాత అసెంబ్లీలో డ్రామాలు ఆడుతూ ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు.

అధికారులు చట్టప్రకారం నడుచుకోవాలి

అధికారులు చట్టం, నిబంధనల ప్రకారం నడుచుకోవాలని తెలిపారు. తమ ప్రభుత్వం చేసిన, ప్రారంభించిన అభివృద్ధి పనులు నాణ్యతగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సోమశిల బ్యాక్ వాటర్‌కు రూ.250 కోట్ల నిధులు మంజూరు చేయించామని, కోడూరు చిట్వేలి రోడ్డు విస్తరణకు రూ.50 కోట్లతో పనులు, బ్రిడ్జీలు వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. వీటిని పైరవీలకు లొంగకుండా నిబంధనల ప్రకారం నాణ్యతగా జరిపించాలని తెలిపారు. ప్రతిపక్షంగా ప్రతి ఒక్కటీ పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, రాష్ట్ర టూరిజం మాజీ డైరెక్టర్ మందల నాగేంద్ర, చెవు శ్రీనివాసులురెడ్డి, బత్తల సుబ్రమణ్యం, శ్రీనివాసులురెడ్డి, నరసింహారెడ్డి, మల్లి, కృష్ణారెడ్డి, రౌఫ్, నాయకులు పాల్గొన్నారు.